# 4. పండగపూట వాడని పువ్వు

తాను ఎక్కవలసిన బస్సు ఇంకా రాకపోవడంతో విశ్వనాథం విసుక్కున్నాడు. చిరాకుపడ్డాడు. ఎప్పుడెప్పుడు ఇంటికి వెడదామా అని తహతహలాడాడు. బస్సు త్వరగా రానందుకు బస్సులు నడుపుతున్న ప్రభుత్వ శాఖను తూర్పారపట్టాడు. కాని మంత్రాలకు మామిడికాయలు రాలే రోజులా యివి!

ఎలాగయితేనేం చివరికి విశ్వనాథం ఎక్కవలసిన బస్సు లంఖణాలు పడ్డ మనిషిలా వచ్చి చేరింది.

బస్సు ఎక్కాడో లేదో, ఇల్లు ఎప్పుడెప్పుడు వస్తుందా అని తహతహ చెందాడు. అతని తహతహకు కారణం లేకపోలేదు.

తెల్లవారితే మకరసంక్రాంతి. అంత త్వరగా చేతికి రాదనుకున్న డబ్బు సరిగ్గా భోగి సాయంకాలం చేతికి వచ్చింది. నూటయాభై రూపాయలు! ఏనుగెక్కినంతగా సంతోషించాడు విశ్వనాథం. ప్రతి పండక్కి చేతిలో డబ్బు ఉండేది కాదు. ఈసారి కూడా ఆ పరిస్థితికి భిన్నం ఉండదనుకున్నాడు. కాని తలవని తలంపుగా పరిస్థితిలో మార్పు ఏర్పడేసరికి విశ్వనాథం సంతోషించడా మరి!

సంతోషంతోపాటు, దూరపు బంధువు దగ్గర మూడు నెలలక్రితం చేబదులుగా తీసుకున్న వంద రూపాయలు అతని కళ్ల ముందు నిలిచాయి, వంద కత్తుల్లాగా. అసలే దూరపు

బంధువు; అందులోనూ కొంచెం ఖచ్చితం మనిషి. రాతకోతలు లేని అప్పు. కాలం గడిచేకొద్దీ, ఆయనకి తనమీద అపనమ్మకం కలగవచ్చు. ఆతరవాత అసహ్యమూ కలగవచ్చు. భయ పడ్డాడు విశ్వనాథం. ఆ అప్పుని తీర్చుదామనుకున్నాడు. తీరిస్తే...వట్టి యాభై రూపాయలతో ఏం వస్తుందని, ఖర్చులు మండిపోతున్న యీ రోజుల్లో. ఒక్కసారి తనవంక చూచు కున్నాడు. వేసుకున్న చొక్కా పదిహేను నెలల నాడు కొన్నది. రంగు వెలిసిపోయింది. కట్టుకున్న ధోవతి పాత దయింది. చాలా ఉతుకులకు వెళ్లడం వల్ల కాబోలు, ఉత్తరీ యంలో చిల్లులు కనిపిస్తున్నాయి. కొత్తవి కొనుక్కోవాలి. ఆ కొనుక్కునేది పండక్కి కొనుక్కుంటే—తృప్తిగానూ వుంటుంది, గుడ్డలు అమరినట్టూ వుంటుంది.

ఇప్పుడు ఒక్కసారిగా నూటయాభై రూపాయలు చేతికి రావడంతో విశ్వనాథం మనస్సు తేలికపడింది. తన అర్ధాంగికీ, అమ్మాయికీ ఒకపాటి గుడ్డలు కొనవచ్చుననుకున్నాడు. అను కోవడమేమిటి, అంగడికి వెళ్లడమేమిటి — ఏకకాలంలోనే జరిగాయి.

తొంభై రూపాయలకు ఒక చీరా, ఇరవై రూపాయలకు ఒక గౌనూ కొన్నాడు విశ్వనాథం. అతని కిప్పుడు నలభైరెండేళ్లు. వివాహమై ఏడేళ్లయింది. చాలా కాలం బ్రహ్మచర్యం అవలం బించిన విశ్వనాథం ఒక్క రోజులో గృహస్థాశ్రమం స్వీకరించా లని అభిలషించాడు. చివరిదాకా బ్రహ్మచారిగానే ఉండి పోవాలనుకున్నాడు; కాని కళ్యాణ ఘడియ అలా తోసుకు వచ్చింది. ఒక యింటివాడయ్యాడు; ఆడపిల్ల తండ్రికూడా అయ్యాడు, అచిరకాలంలోనే.

విశ్వనాథం ఆలోచనలో పడ్డాడు. తనకా స్థిరాస్తి అంటూ యేమీ లేదు. చేస్తున్నది గుమాస్తా ఉద్యోగం. పెళ్లికాక ముందు ఏదో కొంచెం కూడబెట్టగలిగాడు. ఇప్పు డదీ లేదు. ఇలాంటి పరిస్థితిలో తాను ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం అంత మంచిది కాదేమో అనుకున్నాడు. అమ్మాయికి ఆరేళ్లు. బహుశః నాలుగైదు నెలల్లో మళ్లీ సంతానం కలగవచ్చు. సంసారం పెరుగుతోంది. బాధ్యతలు పెరుగుతున్నాయి. కాదు, కాదు—బాధ్యతలు పెంచుకున్నా ననుకున్నాడు విశ్వనాథం. కొంచెం బాధపడ్డాడు. ఇక బాధపడి లాభం లేదను కున్నాడు ఆ మరుక్షణంలోనే. తన ఆర్థికస్తోమతను పెంచు కునేందుకు కృషి చెయ్యసాగాడు.

చిన్నప్పుడు విశ్వనాథం బొమ్మలు బాగా గీసేవాడు. ఉన్నత పాఠశాలా విద్యార్థిగా ఉన్న రోజుల్లో నాలుగైదు బహు మతులు కూడా పొందాడు. గొప్ప చిత్రకారుడవుతాడని ఉపాధ్యాయులు ఊహించారు. తానూ అలాగే అను కున్నాడు. కాని గుమాస్తా ఉద్యోగంలో పడిపోవడమూ, చాలా యేళ్లు బ్రహ్మచారిగా ఉండడమూ తన సంపాదన తన ఒక్కనికి చాలకపోతుందా అన్న అభిప్రాయం కలగడమూ— ఇవన్నీ ఒక విధంగా అతన్ని బద్ధకస్తుణ్ణిగా చేశాయి. ఉబుసు పోకకు బొమ్మలు వేసేవాడు. అంతేకాని దాన్ని ఒక కళగా వృద్ధి చేసుకోలేదు. ఇప్పుడు సంసారం పైబడేసరికి, విశ్వనాథం తన చిత్రలేఖనాన్ని ఒక కళగా వృద్ధి చేసుకోసాగాడు. తద్వారా తృణమో పణమో కళ్లచూడసాగాడు. అలా తన ఆర్థిక పరిస్థితిని కొంచెం మెరుగుపరుచుకున్నాడు. ఇవాళ

చేతికి వచ్చిన నూటయాభై రూపాయలు చిత్రలేఖనం ద్వారా వచ్చినవే!

దోవలో ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రయాణం చేసి, తాను దిగవలసిన స్టాపింగులో బస్సు ఆగింది. విశ్వనాథం సంతోషించాడు. కొన్న చీరా గౌనూ భార్యకు చూపి, ఆమె సంతోషాన్ని పంచుకోవాలనుకున్నాడు. పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ ఇల్లు చేరుకున్నాడు.

విశ్వనాథాన్ని చూస్తూనే 'అమ్మా—నాన్న' అంటూ గబ గబా వచ్చి లలిత అతని చేతిలోని పాకెట్టు తీసుకుంది.

తళతళ మెరిసిపోతున్న గౌనుని చూసి లలిత సంతోషంతో ఉప్పొంగిపోయింది. 'గౌను, గౌను' అంటూ కేకలు వేసింది.

విశ్వనాథం సంతోషానికి మేరలేదు.

చిన్నారి లలిత పట్టరాని సంతోషంతో హంగామా చేస్తున్నా, భార్య లోపల్నుంచి బయటికి రాకపోవడంతో విశ్వనాథం హృదయం గతుక్కుమన్నది; సంతోషం దెబ్బ తిన్నది.

లోపలికి వెళ్లి చీర పాకెట్టుని బల్లమీద పెట్టాడు.

'జోరీగల్లా అప్పులు ఒక వైపు ముసురుతూవుంటే, చీర కావలసివచ్చింది కాబోలు నాకు.' వంటింట్లోంచి భార్య విసిరి వేసిన రాయి సరిగ్గా విశ్వనాథం గుండెమీద తగిలింది.

బల్లకెదురుగావున్న కుర్చీలో కూలబడ్డాడు విశ్వనాథం, గుండెలోంచి పైకుబికిన అసంతృప్తిని అణుచుకుంటూ.

మళ్లీ యింకో రాయి వచ్చి మీాద పడింది. అది సరిగ్గా నడినెత్తిమీాద పడింది. తల చిల్లిపడినట్లనిపించింది. 'ఆయనకి

శేవటిలోగా 'ఆ వంద రూపాయలూ కావాలట. ఇవ్వకపోతే మొహమాటం పోతుందన్నాడు. ఇప్పుడేం చేస్తారో చెయ్యండి.'

విశ్వనాథం ఆలోచన చేసేలోపల 'ఎవరు మిమ్మల్ని యీ చీర కొనమన్నారు? చీర కావాలని నేను అఘోరించానా? ఇదొక్కటే తక్కువయిందికాబోలు నా బతుక్కి' అని యింకో రాయి వంటింట్లోంచి దూసుకువచ్చింది.

నీ బతుక్కి ఏం తక్కువయింది? ప్రేమించే భర్త, అందాల బరిణ వంటి కూతురు. అన్నవస్త్రాలకు లోపం లేదు—అందా మనుకున్నాడు విశ్వనాథం. ధైర్యం చాలలేదు. మాట పెగల లేదు. సముద్రతరంగంలా మనస్సులోని మాట మనస్సులోనే అణగిమణగి పోయింది.

వంటిల్లు ప్రశాంతంగా ఉంది.

విశ్వనాథం మనస్సు మళ్లీ పనిచేయడం మొదలుపెట్టింది.

'అవును. ఆమె అన్నమాటల్లో తప్పేముంది? జోరీగల్లా అప్పులు ఒక వైపు ముసురుతూవుంటే, చీరలు సారెలు కావాలా తన గుమాస్తా వుద్యోగానికి? పండగలూ పబ్బాలూ చేసుకోవాలా తాను? సరదాలూ గిరదాలూ కావాలా తనకు? నూటయాభై రూపాయలు చూడగానే ఆ దూరపు బంధువు గుర్తుకి వచ్చాడు. పాతబడిన తన బట్టలూ గుర్తుకి వచ్చాయి. కాని పండగరోజున తన భార్య, తన కుమార్తె ఎందుకో తన హృదయాన్ని పూర్తిగా ఆక్రమించారు. వాళ్ళ సంతోషమే తనకు ముఖ్య మనిపించింది. అవును...ఆమె చీర కోరలేదు. చీర కావాలనీ అడగలేదు. అమ్మాయికి గౌను కొనమనీ చెప్పలేదు. తానే కొన్నాడు. తన ముద్దూ

ముచ్చటలు తీర్చుకునేందుకు కొన్నాడు. పండగరోజున తన యింటి వాకిట్లో ఒక పెద్దమనిషి నోరు పారేసుకుంటే, సహించ లేకపోయింది తన భార్య; ఆత్మాభిమానం గల తన భార్య. ఇందులో తప్పేముంది? అప్పులు లేని రోజే నిజమైన పండగ రోజని హితోపదేశం చేసింది.'

విశ్వనాథం మనస్సు కొంచెం తేలికపడింది. ఆ దూరపు బంధువు అప్పు తీర్చడానికి ఏదో దారి వెతకసాగాడు.

'భోజనానికి రండి. ఇప్పటికే పొద్దుపోయింది. తెల్లారితే పండగ. బోలెడు పని' అంది భార్య. ఆమె మాటలు రాళ్లుగా లేవు; దూదిపింజెల్లా వున్నాయి.

విశ్వనాథం భోజనానికి లేవబోయాడు.

'మరే...మరే...మా నాన్న నాకు మాంఛి గౌను కొని పెట్టాడుగా' అంటోంది లలిత, పక్కింటి పిన్నిగారి కూతురుతో.

విశ్వనాథం సంతోషించాడు. అభమూ శుభమూ ఎరగని తన కుమార్తె మనస్సు—పువ్వువంటి మెత్తని మనస్సు—పండగ పూట వాడనందుకు.